బీజేపీతోనే దేశ సుస్థిరత

● కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, పురుషోత్తం

రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ఊట్కూర్, ఫిబ్రవరి 20 : దేశ సుస్థిరత నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికే సాధ్యమని కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, పరుషోత్తం రుపాల అన్నారు. మంగళవారం మక్తల్ నియోజకవర్గంలోని కృష్ణ మండలకేంద్రంలో కృష్ణమ్మ తల్లికి పూజలు నిర్వహించిన అనంతరం బీజేపీ విజయ సంకల్ప బస్సు యాత్రను ప్రారంభించారు. కృష్ణ మండలం టైరోడ్డు నుంచి మాగనూర్, మక్తల్, ఊట్కూర్ మండలాల మీదుగా నారాయణపేట జిల్లా కేంద్రానికి యాత్రను కొనసాగించారు. మక్తల్ పట్టణంలోని నెహ్రూగంజ్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలనుద్దేశించి కేంద్ర మంత్రులు మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో బొగ్గు, ఎరువుల కుంభకోణాల కుపాల్పడుతూ దేశ ఆర్థిక ప్రగతిని దివాళా తీయించిందన్నారు. బీజేపీ ప్రభుత్వంతోనే 500 ఏండ్లుగా ఎదురు చూస్తున్న రామ మందిర నిర్మాణం సాధ్యమైందని వివరించారు.

జింకల బారినుంచి కాపాడుతాం..

ఊట్కూర్‌లో మండల కేంద్రంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు జిల్లాలో జింకల బెడద అధికంగా ఉందని, వాటిని తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని కోరారు. స్పందించిన మంత్రి ఎన్నికల తర్వాత జింకల పార్కు ఏర్పాటు లేదా వాటిని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, రాష్ట్ర నాయకులు జితేందర్‌రెడ్డి, శాతికుమార్, బంగారు శృతి, నాగూరావు నామాజీ, జలందర్‌రెడ్డి, శ్రీనివాసులు, భాస్కర్, భరత్, హన్మంతు, విజయకుమార్, కృష్ణయ్యగౌడ్, రమేశ్ పాల్గొన్నారు.

బీజేపీ యాత్రకు జనం కరువు

మక్తల్ టౌన్, ఫిబ్రవరి 20 : 'తీన్మార్ మోదీ సర్కార్ ఆయేగీ' అనే సంకల్పంతో బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్ర మంగళవారం నారాయణపేట జిల్లా కృష్ణ మండలం నుంచి ప్రారంభమైంది. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, పురుషోత్తం రూపాలా, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ బస్సు యాత్రకు శ్రీకారం చుట్టారు. కృష్ణ, మాగనూరు మీదుగా యాత్ర మధ్యాహ్నం రెండున్నర గంటలకు మక్తల్‌కు చేరుకున్నది. ఈ సందర్భంగా మంత్రులు ఇద్దరూ ప్రసంగిస్తుండగా.. కమలం పార్టీ కార్యకర్తలే కనిపించారు. రైతులు, ప్రజలు పెద్దగా హాజరుకాలేదు. యాత్రకు సంఘీభావం తెలపడానికి వచ్చిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, జెండాలే ఎక్కువగా కనిపించాయి. కాగా ఎండను తట్టుకోలేక వచ్చిన వారిలో చాలా మంది సమీపంలోని దుకాణాల వద్దకు వెళ్లి నిల్చున్నారు. అయితే జనసమీకరణలో స్థానిక నేతలు విఫలమయ్యారంటూ పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు.

నేడు కోస్గికి సీఎం రాక

కోస్గిలో సభాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ యోగేశ్‌గౌతమ్

కోస్గి, ఫిబ్రవరి 20 : నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోస్గికి రానున్నారు. ఈ సందర్భంగా పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతోపాటు మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగసభ నిర్వహించనున్నారు. వీటికి సంబంధించిన ఏర్పాట్లను ఎస్పీ యోగేశ్‌గౌతమ్ మంగళవారం పరిశీలించారు. కోస్గి పట్టణంలో హెలీప్యాడ్, సభాస్థలి, పార్కింగ్ స్థలాలను పరిశీలించి బందోబస్తుకు సంబంధించిన పలు సూచనలు, సలహా ఇచ్చారు. ఆయన వెంట పోలీసు అధికారులు, నాయకులు ఉన్నారు.

జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయం

నారాయణపేట, ఫిబ్రవరి 20 : క్రీడాకారులు జాతీయ స్థాయిలో ప్రతిభ చాటడం అభినందనీయమని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అన్నారు. ఈనెల 16నుంచి 18వ తేదీ వరకు గుజరాత్‌లో జాతీయ స్థాయి అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 60ఎంల్ ట్రయాథ్లాన్, 600మీటర్ల లాంగ్ జంప్ పోటీల్లో అండర్ -14 బాలుర విభాగంలో నారాయణపేట జిల్లాకు చెందిన బసంత్ బ్రాంజ్ మెడల్ సాధించాడు. మంగళవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ప్రతిభ చాటిన క్రీడాకారుడు బసంత్‌ను పూలమాల, శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, కోచ్ జగదీశ్, భరత్, అసోషియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

నారాయణపేటరూరల్, ఫిబ్రవరి 20 : మండలంలోని లింగంపల్లి ఎల్లమ్మ జాతర సందర్భంగా మంగళవారం నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఘనంగా పంచవటి వార్షికోత్సవం

కార్యక్రమంలో సాంస్కృతిక నృత్యం చేస్తున్న విద్యార్థులు

పాలమూరు, ఫిబ్రవరి 20 : జిల్లా కేంద్రంలోని పంచవటి విద్యాలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. పాలమూరును స్టడీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అనితా రెడ్డి, చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ I, **MOHAMMED SADIQ** S/o **MOHAMMED BABAR,** R/o H.No: 5-4-85/F/19/1-A,Tayyab Nagar, Ramaiah Bowli, Mahabubnagar Town and Dist. T.S., hereby state my Son name changed from **SHAIK MOHAMMED ABDUL RAHMAN** (old name) to **SHAIK MOHAMMED ALI** (new name).

NT-MBNR

CHANGE OF NAME

★ I, **MOHAMMED SADIQ** S/o **MOHAMMED BABAR,** R/o H.No: 5-4-85/F/19/1-A, Tayyab Nagar, Ramaiah Bowli, Mahabubnagar Town and Dist. T.S., hereby state my Daughter's name changed from **SHAIK ARFA ANAM** (old name) to **SHAIK SHIFA TABASSUM** (new name).

NT-MBNR

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

స్వామి కటాక్షం అందరిపై ఉండాలి

● మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పాలమూరు, ఫిబ్రవరి 20 : లక్ష్మీనర్సింహస్వామి కరుణ, కటాక్షం మనందరిపై ఉండాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సింహగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయంలో సుదర్శన నరసింహ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి పట్టు వస్త్రాలను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌తో కలిసి స్వామివారికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేయగా ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన సింహగిరి క్షేత్రంలో కొలువైన లక్ష్మీనరసింహస్వామికి పట్టు వస్త్రాలను సమర్పించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. 37 సంవత్సరాలుగా ఎంతో వైభవంగా బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కౌకుంట్ల చంద్రమౌళి, ఈవో రంగాచార్యులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఓంప్రకాశ్, బాంగర్, సూది రాము, పోల శ్రీనివాస్, ముడావత్ రమేశ్, బాలకిష్టయ్య, ఉమారాణి, శేఖర్‌నాయక్, సత్యంనాయక్ పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తీర్ణత సాధించాలి

పాలమూరు, ఫిబ్రవరి 20 : పదో తరగతిలో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలకేంద్రంలో సీడబ్ల్యూసీ ఆహ్వానితులు చల్లా వంశీచందర్‌రెడ్డి సహకారంతో ఎన్ఎస్‌యూఐ నాయకులు విద్యార్థులకు ప్యాడ్లు, నోట్‌బుక్స్ అందించగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, కౌన్సిలర్ లక్ష్మణ్‌నాయక్, మాజీ జెడ్పీటీసీ శేఖర్‌నాయక్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు రమేశ్, జిల్లా అధ్యక్షుడు అవేజ్, సత్యంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ అరెస్ట్

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 20: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు నాగర్ కుంట నవీన్‌రెడ్డిని తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేసి, శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇటీవల అనేక విమర్శలు, ఆరోపణలు ఎదుర్కొంటున్న నవీన్‌రెడ్డిపై గతంలో వివిధ రకాల కేసులు ఉన్నట్లు తెలిసింది. అయితే మంగళవారం ఇంట్లో నుంచి అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలించిన పోలీసులు మధ్యాహ్నం సమయంలో శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ నుంచి షాద్‌నగర్ కోర్టుకు తరలించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ వద్ద నవీన్‌రెడ్డి మాట్లాడుతూ తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇంట్లో ఉన్న తనను తెల్లవారుజామున అరెస్టు చేసిన పోలీసులు ఇక్కడికి తీసుకువచ్చారని ఆరోపించారు. వివిధ ఫైల్స్‌పై సంతకాలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని, పోలీసుల నుంచి తనకు తీవ్రంగా వేధింపులు ఉన్నాదని రక్షణ కల్పించాలని కోరారు.

బాలికపై లైగింక వేధింపులు

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, ఫిబ్రవరి 20 : జిల్లా కేంద్రంలో రెండు రోజుల కిందట ఎనిమిదేండ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఘటన చోటు చేసుకోగా మంగళవారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. వనటౌన్ ప్రాంతంలో ఓ కుటుంబం కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నది. వారికి చెందిన బాలికను ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మున్సిపాలిటీలో పనిచేస్తున్న యాదగిరి బాలికకు మాయమాటలు చెప్పి లైంగికదాడికి యత్నించాడు. ఈ విషయం సదరు బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో వారు యాదగిరిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విచారణ నిర్వహించి నిందితుడిపై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

ఇసుక రవాణాను అడ్డుకున్న గ్రామస్తులు

మిడ్జిల్, ఫిబ్రవరి 20 : అనుమతిల పేరుతో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. మంగళవారం మండలంలోని అయ్యవారిపల్లి టిప్పర్లుతో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండగా గ్రామస్తులు, నాయకులు అడ్డుకున్నారు. గ్రామంలో ఉన్న ఇసుక డంపులను గ్రామ అవసరాలకే ఉపయోగించుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే అనురుధ్‌రెడ్డి మా ఊరు బొద్రాయి మీద ఒట్టు వేసి ఇసుక అనుమతులు ఇవ్వనని చెప్పి.. ఇప్పుడు మాట మారుస్తున్నారని రైతులు ఆరోపించారు. ఇసుక అనుమతులు రద్దు చేయాలని, లేకపోతే రిలేదీక్షలు చేపడతామని బీఆర్ఎస్ నాయకులు నరసింహారెడ్డి, శ్రీకాంత్ ప్రకటించారు.

మార్క్స్‌గ్లోబల్ ఫౌండేషన్

జడ్చర్లటౌన్, ఫిబ్రవరి 20 : జడ్చర్లకు చెందిన ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షురాలు బాలమణి మార్క్స్ గ్లోబల్ ఫౌండేషన్ అంతర్జాతీయ అవార్డును అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో మాజీ అసెంబ్లీ స్పీకర్ మధుసూదనాచారి చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు అవార్డు గ్రహీత తెలిపారు. జడ్చర్లవాసికి అవార్డు దక్కడంపై సంస్కార భారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ తదితరులు ఆమెకు అభినందనలు తెలిపారు.

తాత్కాలిక డిగ్రీ కళాశాల భవనం ప్రారంభం

● ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మినీ అంగన్‌వాడీ టీచర్లకు నియామక పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్ టౌన్, ఫిబ్రవరి 20 : మక్తల్ పట్టణంలో తాత్కాలిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మక్తల్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరై జూనియర్ కళాశాలలో తరగతులు కొనసాగుతున్న నేపథ్యంలో డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఏర్పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మక్తల్ మినీ స్టేడియంలోని భవన సముదాయంలో తాత్కాలిక భవనాన్ని డిగ్రీ కళాశాలకు కేటాయించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఈ భవనంలోనే డిగ్రీ కళాశాల తరగతులు కొనసాగుతాయని త్వరలోనే ప్రభుత్వంతో చర్చించి శాశ్వత కళాశాల భవన నిర్మాణానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అధ్యాపకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి అధ్యాపక బృందం కురుమయ్య, లక్ష్మణ్, బాలకృష్ణ, రాజ్ కుమార్, సవిత, కృష్ణవేణి, పూజ, సుదర్శన్ రెడ్డి, విష్ణు తదితరులు ఉన్నారు

అప్‌గ్రేడ్ పత్రాలు అందజేత

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేయడంతో టీచర్లను కూడా అప్‌గ్రేడ్ చే స్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీటి ని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మంగళవారం అంగన్‌వాడీ టీచర్లకు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులతోపాటు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

● కలెక్టర్ రవినాయక్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 20 : రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని ఏ గ్రామంలోనూ తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ జీ రవినాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా తాగునీరు ఇవ్వని ప్రాంతాల్లో ట్యాంకర్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరైన సీసీ రోడ్ల నాణ్యతతో చేపట్టాలని, ఇందులో స్థానికులకు ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, గ్రామల వారీగా యాక్షన్ ప్లాన్ చేసి నర్సరీల్లో మొక్కలను పెంచాలని, వేసవిలో మొక్కలను కాపాడుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, జెడ్పీ సీఈవో రాఘవేంద్రరావు, డీఆర్‌డీవో నర్సింహులు, డీపీవో వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

సమగ్ర విచారణ జరపాలి

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులపై సమగ్ర విచారణ చేసి సరి చేయాలని కలెక్టర్ జీ రవినాయక్ ఆదేశించారు. మంగళవారం తాసీల్దార్లతో వీసీ ద్వారా కలెక్టర్ మాట్లాడుతూ ఫారం 6,7,8 దరఖాస్తులను పక్కాగా పరిశీలించాలని, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు సమన్వయం చేసుకుంటూ పరిశీలన చేయాలన్నారు. దరఖాస్తులను పరిష్కరించిన వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 20 : ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ మోహన్‌రావు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 28వ తేదీ నుంచి మార్చి 16 వరకు జరుగుతున్న ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. జిల్లాలోని 33 పరీక్షా కేంద్రాల్లో మొదటి సంవత్సరం 10,976 మంది, రెండో సంవత్సరం 10,954 మొత్తం 21,930 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు వెల్లడించారు. పరీక్షలు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు 8:30 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, ఒక నిమిషం అలస్యమైన అనుమతి ఉండదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమల్లో ఉంటుందని, ఈ కేంద్రాలకు సమీపంలో జిరాక్స్ కేంద్రాలను బంద్ చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈసీ సభ్యులు ఉమామహేశ్వర్, రవీందర్, రెవెన్యూ, పోలీస్, ఆర్టీసీ, వైద్యశాఖతోపాటు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

మాస్టర్ అథ్లెట్‌కు సన్మానం

మహబూబ్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 20 : పూణేలో ఈనెల 13నుంచి 17వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ టోర్నీలో జిల్లాకు చెందిన దేవాదానం 75 ఏండ్ల విభాగంలో షాట్‌పుట్‌లో ప్రతిభ చాటి పతకం సాధించాడు. మంగళవారం డీఈవో రవీందర్ అథ్లెట్‌ను అభినందించారు.

25న టాలెంట్ టెస్ట్

పాలమూరు, ఫిబ్రవరి 20 : మహబూబ్‌నగర్ డ్రీం ఫోర్స్ ఫౌండేషన్ డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం సైన్స్ ల్యాబ్ ఆధ్వర్యంలో ఈనెల 25న ప్రభుత్వ బీఈడీ కళాశాలలో పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు టీఎన్ శ్రీధర్ తెలిపారు. మంగళవారం టాలెంట్ టెస్టుకు సంబంధించిన పోస్టర్‌ను డీఈవో రవీందర్ ఆవిష్కరించారు.

విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ

నవాబ్‌పేట, ఫిబ్రవరి 20 : మండలంలోని లింగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మంగళవారం సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు మోహన్‌నాయక్ సహకారంతో సేవాలాల్ యువసేన జిల్లా అధ్యక్షుడు కేతావత్ రవితేజ నాయక్ పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు సుమన్, రాజునాయక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నారాయణపేట టౌన్ : పట్టణంలోని ఎల్లమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

తల్లీ ఎల్లమ్మా చల్లంగా దీవించు..

నారాయణపేటరూరల్, ఫిబ్రవరి 20 : మండలంలోని లింగంపల్లిలో మంగళవారం ఎల్లమ్మ ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. భక్తుల కోర్కెలు తీర్చే ఎల్లమ్మ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం ఎల్లమ్మ భక్తురాలు సాయమ్మ నోటికితాళం వేసే ఘట్టం. సాయమ్మ శరీరానికి వేప మండలతో పుట్టం చుట్టి పసుపు రాసి కుంకుమ బొట్లు పెట్టగానే సాయమ్మ పూనకంలోకి వెళ్తారు. బైండ్లోళ్ల గవ్వల దండ వేసి ఆమె నోటికి రాగితీగతో తాళం వేసే దృశ్యం ఎంతో ముఖ్యమైంది. అనంతరం పెద్ద బోనంతో ఊరేగింపు చేపట్టారు. ఎల్లమ్మ దర్శనానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో జాతర ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పేట సీఐ భగవంత్‌రెడ్డి, ఎస్సైలు వెంకటేశ్వర్లు, కృష్ణదేవ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎల్లమ్మ ఉత్సవాలు మరో నాలుగు మంగళవారాలు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎల్లమ్మ ఉత్సవాలు ప్రారంభం

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 20 : నారాయణపేట జిల్లా కేంద్రంలోని సింగార్‌బేస్‌లో ఎల్లమ్మ ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నిర్వాహకులు అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ వార్డుల నుంచి మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి బోనాలతో ర్యాలీగా వచ్చి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాలు ఐదు మంగళవారాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఊట్కూర్‌లో..

ఊట్కూర్, ఫిబ్రవరి 20 : మండలకేంద్రంలో గ్రామ దేవత రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలను మంగళవారం భక్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. పెద్దింటి శంకర్‌గౌడ్ ఇంటి నుంచి పెద్ద బోనం కుండతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు గ్రామ దేవతకు కోళ్లు, గొర్రెలను బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బోనం గంపలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆలయ పరిసరాల్లో భక్తులు వంటలు వండి విందు భోజనాలు ఆరగించారు. బిజ్వార గ్రామంలోనూ భక్తులు ఎల్లమ్మ ఆలయాన్ని దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో పూజారులు శంకర్‌గౌడ్, రాముగౌడ్, జగదీశ్‌గౌడ్, నరహరిగౌడ్ ఉన్నారు.

విద్యుత్‌శాఖ ఎస్ఈగా వెంకటరమేశ్

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 20 : మహబూబ్‌నగర్ జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈగా వెంకటరమేశ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని డీపీఈ ఎస్ఈగా విధులు నిర్వహిస్తున్న వెంకటరమేశ్‌కు మహబూబ్‌నగర్ ఎస్ఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు మహబూబ్‌నగర్ ఇన్‌చార్జి ఎస్ఈగా విధులు నిర్వహించిన నారాయణపేట ఎస్ఈ ప్రభాకర్ యాధావిధిగా ఆ జిల్లా ఎస్ఈగా బాధ్యతలు నిర్వహించనున్నారు. ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన వెంకటరమేశ్‌ను అధికారులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన

జడ్చర్ల, ఫిబ్రవరి 20 : జడ్చర్ల మండలంలోని గంగాపూర్ జాతరలో మంగళవారం ఎయిడ్స్(హెచ్ఐవీ)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సహకారంతో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశానుసారం ఎంఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కళాజాత బృందం ఆటాపాటలతో ప్రజలకు ఎయిడ్స్ పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఆర్‌డీఎస్ ప్రోగ్రాం మేనేజర్ అశోక్‌గౌడ్, దివాకర్, తార, పద్మ, సబిత ఉన్నారు.

రేపు అథ్లెటిక్స్ జిల్లా స్థాయి ఎంపికలు

నారా